APTEL/2009/29308

# స్నేహిత ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు

తెలుగు దినపత్రిక

03-03-2026
మంగళవారం
హైదరాబాద్
సంపుటి: 17 । సంచిక: 131
పేజీలు: 04 । వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్

FOLLOW:
https://epaper.expresstelugudaily.com



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు.. 2

## రైతులకు సబ్సిడీపై వ్యవసాయ డ్రోన్‌ల పంపిణీ..

- మొదటి దశలో ప్రతి జిల్లాకు 10 చొప్పున అందజేత
- డ్రోన్ల వినియోగంతో కూలీల ఖర్చు తగ్గి రైతులకు లాభం పెరుగుతుంది
- వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చడం ప్రభుత్వ ధ్యేయం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



2

## ఇరాన్‌పై మరింత భీకర దాడులు చేస్తాం

- మా జోలికి వచ్చిన వారిని ఎవరినీ వదిలిపెట్టబోం
- ఇరాన్ ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దు
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



2



# అహంకారాన్ని వీడండి

## ఇగోల కంటే పార్టీ ఎంతో ముఖ్యం



- పార్టీ కోసం పని చేయండి
- డీసీసీ అధ్యక్షులు.. మరో పదిమందిని తయారు చేయాలి
- కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పిలుపు
- వికారాబాద్‌లో ముగిసిన డీసీసీ అధ్యక్షుల శిక్షణ శిబిరం
- పాల్గొన్న సీఎం రేవంత్, టీపీసీసీ చీఫ్

**వికారాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** నాయకులు తమ అహంకారాన్ని పక్కన పెట్టి పని చేయాలని, ఇగోల కంటే పార్టీ ఎంతో ముఖ్యమని, పార్టీ కోసం నిరంతరం పని చేయాలని, డీసీసీ అధ్యక్షులు.. మరో పదిమందిని తయారు చేయాలని, పని చేస్తున్న వారిని గుర్తించాలని ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండల్లోని హరిత రిసార్ట్‌స్‌లో జరిగిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ డీసీసీ అధ్యక్షుల 10 రోజుల శిక్షణ శిబిరం ముగింపు వేడుకలకు రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా.. మార్షల్ ఆర్ట్స్ చేస్తూ డీసీసీ అధ్యక్షులకు క్లాస్ చెప్పారు. జియు జిట్సు అనే మార్షల్ ఆర్ట్‌లో మెళకువలను డీసీసీ అధ్యక్షులకు వివరించారు. మార్షల్ ఆర్ట్‌స్‌ను వ్యక్తిగత జీవితంలో అన్వయించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ఐడియాలజీపై క్లాస్ చెప్పారు. ఇండియా ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐసీసీ అగ్రనేత వివరించారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ మాట్లాడుతూ... పాకిస్థాన్‌కు చైనా మద్దతు ఇస్తోందని.. ఇరాన్ వెనక చైనా, రష్యా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు మోదీ పూర్తిగా సరెండర్ అయ్యారని.. ట్రంప్‌కు వ్యతిరేకంగా మోదీ పని చేయలేరని రాహుల్

మిగతా2లో...



బుద్ధవనాన్ని అంతర్జాతీయ విశ్వశాంతి కేంద్రంగా

# అభివృద్ధి చేస్తాం

- ఆచార్య నాగార్జునుడు నడయాడిన ఈ నేల భారత నాగరికతకు గర్వకారణం
- స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలతో కూడిన సమాజ నిర్మాణానికి బుద్ధుని బోధనలే పునాది
- తెలంగాణ ప్రభుత్వం బౌద్ధ వారసత్వ సంపదకు కొత్త జీవం పోస్తోంది
- మంత్రి జూపల్లి కృష్ణారావు

**నాగార్జునసాగర్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ప్రపంచ వ్యాప్తంగా ఆధ్యాత్మిక అన్వేషకులకు తెలంగాణను ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ లోని బుద్ధవనం లో నిర్వహించిన 'మూడవ బుద్ధ ధమ్మ యాత్ర' ముగింపు కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి ఆయన

మిగతా2లో...

## హైడ్రా పేరిట పేదల ఇళ్లు కూల్చేస్తున్నారు




- పెద్దలతో బేరసారాలు కుదుర్చుకుని వారి జోలికి వెళ్లడం లేదు
- బాన్సువాడలో జరిగిన ఘటన దురదృష్టకరం
- బఫర్ జోన్‌లో ఎన్ని ఇళ్లున్నాయి? ఎన్ని కూల్చారు?
- కేంద్రమంత్రి బండి సంజయ్ బండి సంజయ్

2

## భారత్-కెనడా మధ్య యురేనియం డీల్

- 2.6 బిలియన్ డాలర్ల విలువైన భారీ యురేనియం సరఫరా
- ఈ ఒప్పందం మీద సంతకాలు చేసిన రెండుదేశాలు
- చిన్న తరహా రియాక్టర్లు , అధునాతన రియాక్టర్ల సాంకేతికతపై కలిసి పనిచేయనున్న ఇరుదేశాలు
- సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంపై చర్చలు జరిపేందుకు అంగీకారం



**నేషనల్ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ssభారత్, కెనడా దేశాల మధ్య దౌత్య, ఆర్థిక సంబంధాల్లో కీలక అడుగు పడింది. సోమవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో భారత ప్రధాని నరేంద్ర మోడీ, కెనడా ప్రధాని మార్క్ కార్నీ మధ్య జరిగిన ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా

మిగతా2లో...



రాహుల్ గాంధీ నుంచి ఆశించి

## ఉపయోగం లేదు

- ఆర్‌ఆర్‌ట్యాక్స్ వసూలు చేసుకోవడానికే పక్కా ప్లాన్‌తోనే వచ్చారు
- ఇచ్చిన హామీలపై చిత్తశుద్ధి ఉంటే మొదట వాటి అమలుపై సమీక్షించేవారు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాష్ట్రం నుంచి ఆర్ ఆర్‌ట్యాక్స్ వసూలు చేసుకోవడానికే పక్కా ప్లాన్‌తోనే రాహుల్ గాంధీ తెలంగాణ వచ్చినట్లు స్పష్టంగా అర్థమవుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ ఆయనకు తెలంగాణ ప్రజల సమస్యలపై కనీస

మిగతా2లో...

## నిబంధనల ప్రకారమే చర్యలు

- ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉంది
- ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయంగా యంత్రాంగం పనిచేస్తోంది
- భూదాన్ భూములను ల్యాండ్ మాఫియా నకిలీ పత్రాలతో విక్రయించారు
- ఈ మోసానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం
- బాధితుల నుండి వసూలు చేసిన సొమ్మును తిరిగి ఇప్పించేలా చర్యలు చేపడతాం
- కేరళ సీఎం విజయన్‌కు మంత్రి పొంగులేటి కౌంటర్

2



## బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు



2

- హైడ్రాకు కాంగ్రెస్ నేత షాహెద్ అన్సారీ ఫిర్యాదు
- జీహెచ్‌ఎంసీ అధికారులు అక్రమార్కులను వత్తాసు పలుకుతున్నారు
- బఫర్ జోన్‌లో సైతం నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలకు అనుమతులు
- ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు హైడ్రా తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్న అన్సారీ

# మైనింగ్ ఈవేలంలో భారీ అక్రమాలు

### గనుల శాఖ చేపట్టిన ఈ వేలం ప్రక్రియ పారదర్శకతకు విరుద్ధంగా సాగింది

విచారణ జరిపి, వివాదాస్పద టెండర్లను రద్దు చేయాలి

మైనింగ్ బ్లాక్‌లలో సుమారు 1,100 ఎకరాల రిజర్వ్డ్ ఫారెస్ట్ భూమి ఉంది

టెండర్ పత్రాల్లో చట్టబద్ధంగా అవసరమైన వివరాలు పొందుపరచలేదు

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** సూర్యాపేట జిల్లాలోని మైనింగ్ బ్లాక్‌ల ఈవేలం ప్రక్రియలో తీవ్రమైన అక్రమాలు, విధానపరమైన లోపాలు, చట్ట ఉల్లంఘనలు జరిగాయని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై తక్షణమే స్వతంత్ర విచారణ జరిపి, వివాదాస్పద టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. గనుల శాఖ చేపట్టిన ఈ వేలం ప్రక్రియ పారదర్శకతకు విరుద్ధంగా సాగిందని ఆరోపించారు. పసుపులబోడు, సైదుల్నామా, సుల్తాన్‌పూర్ మైనింగ్ బ్లాక్‌లలో సుమారు 1,100 ఎకరాల రిజర్వ్డ్ ఫారెస్ట్ భూమి

మిగతా2లో...

## అంబర్‌పేటలో ముగ్గురి ఆత్మహత్య కేసు

- నలుగురు అక్రమ వడ్డీ వ్యాపారుల అరెస్టు
- వడ్డీ వేధింపులే కారణమని పోలీసుల నిర్ధారణ




**హైదరాబాదు, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** అంబర్‌పేట బాపునగర్‌లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో నలుగురు అక్రమ వడ్డీ వ్యాపారులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సికింద్రాబాదు జోన్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో డిసిపి రక్షిత కె. మూర్తి వివరాలు వెల్లడించారు. ఫిబ్రవరి 24న హోటల్ వ్యాపారి కడిగేకర్ రామ్‌రాజ్, భార్య మాధవి, కుమారుడు శశాంక్‌రాజ్ ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నారు.

మిగతా2లో...

# మైనింగ్ ఈ-వేలంలో భారీ అక్రమాలు

(మొదటి పేజీ తరువాయి)
ఉన్నప్పటికీ.. టెండర్ పత్రాల్లో చట్టబద్ధంగా అవసరమైన వివరాలు పొందుపరచలేదని ఆరోపించారు. ముఖ్యంగా మినరల్ బ్లాక్‌ల ఖచ్చితమైన అక్షాంశ రేఖాంశ కో ఆర్డినేట్లు, అటవీ కంపార్ట్‌మెంట్ వివరాలు, డీజీపీఎస్ సర్వే ధ్రువీకరణ, వివరణాత్మక సర్వే మ్యాపులు, యూటీఎం జియో కో ఆర్డినేట్లు, అలాగే మినరల్ ఆక్షన్ రూల్స్, 2015, మైన్స్ అండ్ మినరల్స్ యాక్ట్, 1957 ప్రకారం అవసరమైన సమగ్ర జియోలాజికల్ నివేదికలు వెల్లడించలేదని లేఖలో పేర్కొన్నారు. ఇలాంటి లోపాలు వేలం ప్రక్రియ చట్టబద్ధతను, పారదర్శకతను తీవ్రంగా దెబ్బతీస్తాయని తెలిపారు. టెండర్ నోటీసు జారీకి ముందే మినరల్ బ్లాక్‌లను ఖచ్చితంగా గుర్తించి పూర్తి వివరాలు వెల్లడించడం తప్పనిసరి అయినప్పటికీ, ఈ నిబంధనలు పాటించలేదని పేర్కొన్నారు. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన సూచనలను పట్టించుకోకపోవడం, చట్టపరమైన, పర్యావరణ అనుమతులు పూర్తికాకముందే ప్రిఫర్డ్ బిడ్డర్లను ప్రకటించడం వంటి అంశాలు తీవ్ర అనుమానాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు. సైదుల్నామా బ్లాక్‌కు డెక్కన్ సిమెంట్స్ లిమిటెడ్, సుల్తాన్‌పూర్ బ్లాక్‌కు ఎన్‌సీఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థలను ప్రిఫర్డ్ బిడ్డర్లుగా ప్రకటించారని.. ఈ సంస్థలు రిజర్వ్డ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో అక్రమ మైనింగ్ కేసులను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అలాగే.. మైన్స్ అండ్ జియోలజీ శాఖ లీగల్ ఆఫీసర్ ఈ బ్లాక్‌ల సమాచారాన్ని గోప్యంగా పేర్కొంటూ ఫిర్యాదుదారునికి ఇవ్వడానికి నిరాకరించడం పారదర్శకతపై అనుమానాలు పెంచుతున్నదని పేర్కొన్నారు. అటవీ శాఖ నుండి ఎన్‌వోసీ లేకుండానే వేలం నిర్వహించినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. అటవీ అనుమతులు పొందిన తర్వాతే చట్టబద్ధంగా కొత్త టెండర్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా సీఎం తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు.



## రాహుల్ గాంధీ నుంచి ఆశించి ఉపయోగం లేదు



(మొదటి పేజీ తరువాయి)
అవగాహన, ఇచ్చిన హామీలపై చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రానికి వచ్చిన వెంటనే మొదట వాటి అమలుపై సమీక్షించేవారని అభిప్రాయ పడ్డారు. హామీలు ఎలా అమలు అవుతున్నాయని తెలుసుకునే ప్రయత్నం చేసేవారు. కానీ ఇసుమంతైనా జవాబుదారీతనం లేని రాహుల్ గాంధీ నుంచి ఇలాంటివి ఆశించడం తెలంగాణ ప్రజల దురదృష్టకరమన్నారు. తెలంగాణ పర్యటనలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 సబ్ గ్యారంటీలపై యువనేత ఊసెత్తలేదని మండిపడ్డారు. వారికి మతిమరుపు ఉందేమో కానీ తెలంగాణ ప్రజలకు లేదనే విషయాన్ని రాహుల్ గాంధీ గ్రహించాలి. ఎన్నికలప్పుడు అనేక హామీలిచ్చి గెలిచాక ముఖం చాటేసిన కాంగ్రెస్‌కు తెలంగాణ ప్రజలు తప్పకుండా గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## బుద్ధవనాన్ని అంతర్జాతీయ విశ్వశాంతి కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)
పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కల్బుర్గిలోని సిద్ధార్థ బుద్ధ విహార్ నుంచి ప్రారంభమైన ధమ్మ యాత్ర శాంతి సందేశాన్ని ప్రపంచానికి చాటుతూ పవిత్ర నాగార్జునసాగర్ తీరానికి చేరుకోవడం ఆనందకరమన్నారు. ఆచార్య నాగార్జునుడు నడయాడిన ఈ నేల భారత నాగరికతకు గర్వకారణమని పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలతో కూడిన సమాజ నిర్మాణానికి బుద్ధుని బోధనలే పునాది అని తెలిపారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం బౌద్ధ వారసత్వ సంపదకు కొత్త జీవం పోస్తోందని మంత్రి వివరించారు. రాష్ట్రంలోని బౌద్ధ క్షేత్రాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఫణిగిరి, నేలకొండపల్లి, ధూళికట్ట వంటి చారిత్రక బౌద్ధ క్షేత్రాలను బుద్ధవనంతో అనుసంధానిస్తూ ప్రపంచ స్థాయి పర్యాటక సర్క్యూట్‌ను వేగవంతం చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే ఆధునిక సాంకేతికతతో బుద్ధుని బోధనలను యువతకు చేరువ చేసేందుకు బుద్ధవనంలో 'డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్' ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో అంతర్జాతీయ బౌద్ధ సమాజాన్ని ఆహ్వానించి, ఆరామాలు, ధ్యాన కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా బుద్ధవనాన్ని ఒక 'విశ్వశాంతి కేంద్రం (Vishwa Shanti Kendra)'గా తీర్చిదిద్దుతామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. అనిశ్చితితో నిండిన ప్రస్తుత ప్రపంచానికి బుద్ధవనం దారిచూపే దీపంలా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, బుద్ధవనం ప్రాజెక్ట్ మెంటర్ ఆంజనేయ రెడ్డి, ప్రాజెక్ట్ సంఘ డైరెక్టర్ సాంగ్సాక్ కోవిడో, సాంస్కృతిక రాయబారి గగన్ మాలిక్, కలెక్టర్ చంద్రశేఖర్, బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య, థాయిలాండ్‌తో పాటు భారతదేశం నుంచి వచ్చిన బౌద్ధ భిక్షువులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో బౌద్ధ ఉపాసకులు పాల్గొన్నారు.

## హైడ్రా పేరిట పేదల ఇళ్లు కూల్చేస్తున్నారు



**కామారెడ్డి, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** హిందూ ధర్మ పరిరక్షణ కోసం అందరం కలిసి పోరాడాల్సిన సమయం వచ్చిందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఇటీవల బాన్సువాడలో జరిగిన ఘటన దురదృష్టకరమని చెప్పారు. కామారెడ్డిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను ప్రభుత్వం కూల్చేస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. పెద్దలతో బేరసారాలు కుదుర్చుకుని వారి జోలికి వెళ్లడం లేదన్నారు. మూసీ ఒడ్డున గాంధీ విగ్రహం పేరిట, ఖమ్మంలోని భూదాన్ భూముల్లో పేదల ఇళ్ల కూల్చివేతలు చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బఫర్ జోన్‌లో ఎన్ని ఇళ్లున్నాయి? ఎన్ని కూల్చారు? అనే దానిపై చర్చకు సిద్ధమా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. బఫర్ జోన్, ఎఫ్టీఎల్ పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తే.. పెద్దల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేస్తామని బండి సంజయ్ సంచలన వార్నింగ్ ఇచ్చారు. గతంలో అసదుద్దీన్ ఒవైసీ కాలేజీలు కూల్చడానికి విద్యార్థులకు పరీక్షలు ఉన్నాయంటూ సాకు చెప్పారు. మరి ఖమ్మంలో కూల్చివేతలు చేసే సమయంలో ఇంటర్ విద్యార్థుల పరీక్షలు, వారి భవిష్యత్ గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. ఒవైసీ కళ్లలో ఆనందం కోసం హిందువులను జైల్లో వేస్తారా? అని తీవ్ర స్థాయిలో రెచ్చిపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి హిందువులంతా ఏకమైన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బీజేపీ నేతలు తలుచుకుంటే కాంగ్రెస్ నేతలు ఎవరూ బయట తిరగలేరని హెచ్చరించారు. కాంగ్రెస్‌లో అంతర్యుద్ధం మొదలైంది. మూటల కోసం తెలంగాణకు రాహుల్ గాంధీ తెలంగాణకు వచ్చారని బండి సంజయ్ హాట్ కామెంట్స్ చేశారు.

## అంబర్‌పేటలో ముగ్గురి ఆత్మహత్య కేసు

(మొదటి పేజీ తరువాయి)
రామ్‌రాజ్ మల్లాపూర్‌లో "కింగ్స్ బిర్యానీ" హోటల్ నిర్వహిస్తున్నారు. వ్యాపార అవసరాల కోసం మహమ్మద్ వాసి ఉజ్ జమాన్ అలియాస్ ఇర్ఫాన్ (జవహర్ నగర్, మౌలాలి), పి. రాజశేఖర్ రెడ్డి (వెంకటేశ్వర నగర్, మౌలాలి), మహమ్మద్ నవాజ్ (సుధా నగర్, ఓల్డ్ సఫిల్‌గూడ), సయ్యద్ మజీద్ హైదర్ (సాదుల్లా నగర్, మౌలాలి) వద్ద నుంచి రూ.57 లక్షలు అధిక వడ్డీకి అప్పు తీసుకున్నట్లు దర్యాప్తులో తేలింది.నిందితులు రోజువారీ వడ్డీ వసూలు చేస్తూ తీవ్ర ఒత్తిడి తెచ్చి, ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోట్లు, భూమి పత్రాలు బలవంతంగా తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇంటికి వెళ్లి బెదిరింపులకు పాల్పడినట్లు సూసైడ్ నోట్‌లో రాసి ఉందన్నారు. మృతుల కూతురు అమూల్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, కాల్ డేటా రికార్డులు పరిశీలించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు నేరాన్ని అంగీకరించినట్లు వెల్లడించారు.నిందితుల వద్ద నుంచి 12 ఖాళీ చెక్కులు, 6 ఖాళీ ప్రామిసరీ నోట్లు, ఒప్పంద పత్రాలు, యాదాద్రి భువనగిరి జిల్లా గాంధీ మాల్ గ్రామంలోని మూడు ఎకరాల భూమి పత్రాలు, బాండ్ పేపర్లు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.మీడియా సమావేశంలో అడిషనల్ డిసిపి జె. నర్సయ్య, ఓయు ఎసిపి జి. జగన్, అంబర్‌పేట ఇన్స్పెక్టర్ టి. కిరణ్ కుమార్, డిఐ మహ్మద్ హఫీజుద్దీన్, ఎస్సైలు సురేష్, తరుణ్ పాల్గొన్నారు.

## రైతులకు సబ్సిడీపై వ్యవసాయ డ్రోన్‌ల పంపిణీ



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రైతుల కోరిక మేరకు ఆధునిక సాంకేతిక వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు వ్యవసాయ డ్రోన్‌లు సబ్సిడీపై అందజేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. రాష్ట్రంలో యాంత్రికరణను వేగవంతం చేయడం కోసం ప్రభుత్వం 202526 సంవత్సరానికి సబ్ మిషన్ అగ్రికల్చర్ మెకనైజేషన్ పథకం కింద పలు వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంటూ మొదటి దశలో ప్రతి జిల్లాకు 10 చొప్పున వ్యవసాయ డ్రోన్లను 40 శాతం సబ్సిడీతో, గరిష్టంగా రూ.4 లక్షల వరకు వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలు, ప్రాథమిక సహకార సంఘాలకు అందచేయడానికి నిర్ణయించినట్లు వెల్లడించారు. వ్యవసాయ డ్రోన్ల వినియోగంతో పిచికారీ సమయం 70-80 శాతం వరకు తగ్గడంతో పాటు ఎరువులు, సూక్ష్మపోషకాలు సమానంగా పంటపై పిచికారీ చేయడం సాధ్యమవుతుందని, కూలీల ఖర్చు తగ్గి రైతులకు లాభం పెరుగుతుందన్నారు. డ్రోన్లను సబ్సిడీపై సంఘాలకు అందజేయడం ద్వారా సన్న, చిన్నకారు రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించబడిన డ్రోన్లను అందుబాటులోకి తీసుకొచ్చి వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చడం ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రభుత్వం ఒకవైపు ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తూనే, ఉద్యానవన పంటల అభివృద్ధి కోసం పసుపు ఉడకపెట్టే, పసుపు పాలిషింగ్ యంత్రాలు, ఆయిల్ పామ్ కోతకు టెలిస్కోపిక్ హార్వెస్టింగ్ పోల్, ఇతర ఉద్యానవన పంటల కోత పరికరాలను కూడా సబ్సిడీ పథకంలో చేర్చిందన్నారు. ఈ పథకానికి సంబంధించిన అర్హతలు, సబ్సిడీ శాతం దరఖాస్తు విధానం వంటి వివరాలు జిల్లా వ్యవసాయ కార్యాలయాలలో అందుబాటులో ఉంటాయని చెప్పారు. 2025-26 సంవత్సరంలో ఇప్పటివరకు 9936 వ్యవసాయ యంత్రాలను రూ.28.74 కోట్ల సబ్సిడీపై రైతులకు అందచేయడం జరిగిందన్నారు. రానున్న 10 నుంచి 15 రోజుల్లో మిగతావన్నీ రైతులకు అందచేయడానికి ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.

## పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు

- నెతన్యాహుకు మోడీ ఫోన్
- పౌరుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి
- ఘర్షణలను సాధ్యమైనంత త్వరగా ముగించాలని కోరిన మోడీ
- యూఏఈకి అండగా ఉంటామని సంఘీభావం ప్రకటించిన ప్రధాని



**నేషనల్ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై భారత ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తోంది. ప్రస్తుత పరిస్థితులపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో ప్రధాని నరేంద్రమోడీ ఫోన్‌లో మాట్లాడారు. "పౌరుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరాం. అలాగే ఘర్షణలను సాధ్యమైనంత త్వరగా ముగించాల్సిన అవసరాన్ని పునరుద్ఘాటించాం" అని తమ సంభాషణ గురించి మోడీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు.ఇదిలాఉంటే.. ఆదివారం రాత్రి భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ భేటీకి మోడీ అధ్యక్షత వహించారు. దేశ భద్రత, వ్యూహాత్మక అంశాలపై నిర్ణయం తీసుకునే అత్యున్నత కమిటీ ఇది. పశ్చిమాసియాలో ఘర్షణల వల్ల తలెత్తిన పరిణామాలపై ఆ సందర్భంగా చర్చించారు.

**యూఏఈ అధ్యక్షుడికి మోడీ ఫోన్..**
అమెరికాఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతీకార దాడులు చేస్తోంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పైకి కూడా క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించింది. దాంతో ఆ దేశంలో పలువురు భారతీయులు చిక్కుకుపోయారు. ఈ నేపథ్యంలో యూఈఏ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో మోదీ ఫోన్‌లో మాట్లాడారు. ఇరాన్ దాడుల్ని ఖండించారు. యూఏఈకి అండగా ఉంటామని సంఘీభావం ప్రకటించారు. అలాగే తమ పౌరులను జాగ్రత్తగా చూసుకుంటున్నందుకు షేక్ మహమ్మద్‌కు కృతజ్ఞత తెలిపారు.




## నిబంధనల ప్రకారమే చర్యలు

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ చేసిన విమర్శలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా విజయన్‌కు కౌంటర్ ట్వీట్ పెట్టారు. తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయంగా యంత్రాంగం పనిచేస్తోందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్ల గ్రామంలో చోటుచేసుకున్న పరిణామాలపై స్పందిస్తూ, ఈ వ్యవహారంలో రాజకీయ లబ్ధి కోసం కేరళ కాంగ్రెస్‌ను లాగడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్రంలో పాలన పూర్తిగా స్థానిక పరిస్థితులు మరియు చట్టపరమైన నిబంధనల ప్రకారమే సాగుతోంది. భవిష్యత్ తరాల ఆస్తులైన ప్రభుత్వ భూములను కాపాడటం ప్రభుత్వ బాధ్యత. చట్టబద్ధంగా జరుగుతున్న ఈ చర్యలను 'బుల్డోజర్ రాజ్' అని అభివర్ణించడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పేదల పక్షాన ఉంటుందని, వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని వెల్లడించారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్ల గ్రామంలోని భూదాన్ భూములను ల్యాండ్ మాఫియా నకిలీ పత్రాలతో అమాయక ప్రజలకు విక్రయించినట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ మోసానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, బాధితుల నుండి వసూలు చేసిన సొమ్మును తిరిగి ఇప్పించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఇళ్లు కూల్చివేతకు గురైన అర్హులైన పేదలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి పొంగులేటి భరోసా ఇచ్చారు. బాధితులకు ఇందిరమ్మ ఇండ్లు పథకం ద్వారా ప్రభుత్వం తరపున పక్కా గృహాలను నిర్మించి ఇస్తామని, ప్రతి అర్హ పేదవాడికి న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు.

## అహంకారాన్ని వీడండి



(మొదటి పేజీ తరువాయి)
గాంధీ వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో తానెప్పుడూ పైరవీలు చేయలేదన్నారు. గతంలో ప్రజాసమస్యలపై గళం విప్పిన తనపై కేసులు నమోదు చేశారని గుర్తు చేసుకున్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యమని తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షులకు రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశం కోసం రాహుల్ ప్రధాని కావాలని ఆయన ఆకాంక్షించారు. రాహుల్ గాంధీని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) మర్యాదపూర్వకంగా కలిసారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ బలోపేతంపై చర్చించారు.

## ఇరాన్‌పై మరింత భీకర దాడులు చేస్తాం

**నేషనల్ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్‌పై మరింత భీకర దాడులు చేస్తామని హెచ్చరించారు. తమ జోలికి వచ్చిన వారిని ఎవరినీ వదిలిపెట్టబోమని సంచలన ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ఇరాన్ ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించారు. ఇదిలా ఉండగా.. ఇప్పటికే ఇరాన్ సుప్రీం ఖమేనీని చరిత్రలోనే అత్యంత క్రూరమైన వ్యక్తిగా ట్రంప్ అభివర్ణించారు. ముఖ్యంగా తన ట్రూత్ సోషల్ వేదికగా సంచలన కామెంట్లు చేశారు. "ఇది కేవలం ఇరాన్ ప్రజలకే కాదు. ఖమేనీ, అతని గూండాల చేతిలో ప్రాణాలు కోల్పోయిన అమెరికన్లకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న వేలాది మంది బాధితులకు దక్కిన న్యాయం" అని పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌తో కలిసి అమెరికా వాడిన అత్యాధునిక హైలీ సోఫిస్టికేటెడ్ ట్రాకింగ్ సిస్టమ్స్ నుంచి ఖమేనీ తప్పించుకోలేకపోయారని ఆయన వివరించారు.

## భారత్-కెనడా మధ్య యురేనియం డీల్

(మొదటి పేజీ తరువాయి)
ఇరు దేశాల మధ్య 2.6 బిలియన్ డాలర్ల విలువైన భారీ యురేనియం సరఫరా డీల్ కుదిరింది. ఈ ఒప్పందం మీద రెండుదేశాలు సంతకాలు చేశాయి. దేశంలో పౌర అణు ఇంధన కార్యక్రమానికి అవసరమైన ముడి పదార్థాల సరఫరాను నిరంతరాయంగా కొనసాగించడమే ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశం. కేవలం ఇంధన సరఫరాకే పరిమితం కాకుండా.. చిన్న తరహా రియాక్టర్లు , అధునాతన రియాక్టర్ల సాంకేతికతపై కూడా ఇరు దేశాలు కలిసి పనిచేయనున్నారు. ఆర్థిక సంబంధాలను మరింత మెరుగు పరుచుకోవడం లో భాగంగా సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం పై చర్చలను వేగవంతం చేయాలని ఇరువురు నేతలు నిర్ణయించారు. 2026 చివరి నాటికి ఈ ఒప్పందాన్ని కొలిక్కి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కెనడా ప్రధాని మార్క్ కార్నీ స్పష్టం చేశారు. దీనివల్ల ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు భారీగా పెరిగే అవకాశం ఉంది.ప్రధాని మోడీ ఆహ్వానం మేరకు భారత్‌లో ప్రధాని కార్నీ పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 1893లో స్వామి వివేకానంద కెనడాలో పర్యటించిన చారిత్రక సందర్భాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. 'లేవండి.. మేల్కొనండి.. లక్ష్యం చేరేవరకు ఆగకండి' అన్న వివేకానంద సూక్తిని ప్రస్తావిస్తూ, భారత్‌కెనడా సంబంధాల భవిష్యత్తుపై ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు..



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** బఫర్ జోన్ పరిధిలో అక్రమంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాన్ని అడ్డుకోవాలని కాంగ్రెస్ నేత షాహెద్ అన్సారీ హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం, మణికొండ నెక్నంపూర్ గ్రామంలో ని సర్వే నెం: 53, 53, 54/ఎలోని లేక్ వ్యూ కాలనీలోని ప్లాట్ నెం: 3 వద్ద గల 375 చదరపు గజాల స్థలంలో అక్రమంగా గ్రౌండ్ ప్లస్ 2 అంత స్తులతో కూడిన విల్లాలు, వ్యక్తి గత నివాస భవనాల నిర్మాణాన్ని వెంటనే నిలిపేయాలని కోరారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఒక వైపు హైడ్రా అధికారులు అక్రమ నిర్మాణాలు తొలగిస్తుండగా, జీహెచ్ఎంసీ అధికారులు మాత్రం భవన నిర్మాణదారులతో కుమ్మక్కై బఫర్ జోన్‌లో సైతం నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేస్తూ, అక్రమార్కులను వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ఇటీవల కాలంలో నగరంలోని సరస్సులు, ఉద్యానవనాలు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు హైడ్రా తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని ప్రశంసించారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలో అన్యాక్రాంతమైన కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాలు కాపాడారని గుర్తు చేశారు. నెక్నంపూర్లో బఫర్‌జోన్ పరిధిలోని లేక్వ్యూ కాలనీలో అక్రమ నిర్మాణాలను అడ్డుకుని, జీహెచ్ఎంసీ అధికారులు జారీ చేసిన అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# భక్తి మార్గమే శాంతికి మార్గం!





- మహామండలేశ్వరద్ధేశ్వరానందగిరి
- వైభవంగా కొనసాగుతున్న రథయాత్ర
- ఆకట్టుకున్న మహిళల,కోలాటాలు

**రాయికోడ్/న్యాల్ కల్, స్నేహిత ఎక్స్ ప్రెస్:** భక్తి మార్గము మనసుకు ప్రశాంతతను ఇచ్చే పవిత్రమైన మార్గమని, దైవస్మరణ, దైవ జపం, ధ్యానం వంటి ఆధ్యాత్మిక ఆచరణలు మనలోని ఆందోళనలను తగ్గించి మనశ్శాంతిని కలిగిస్తాయని, భక్తి మార్గంలో నడిచే వారు ద్వేషం, అహంకారం దూరం చేసుకొని ప్రేమ, సహనం, క్షమ వంటి గుణాలను పెంపొందించుకుంటారు. అందుకే భక్తి మార్గమే నిజమైన శాంతి మార్గమని బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి మహామండలేశ్వర సిద్ధేశ్వరానందగిరి మహారాజ్, ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమ పీఠాధిపతి దేవగిరి మహారాజ్ పేర్కొన్నారు. శ్రీ దత్తగిరి మహారాజ్ వారి 47వ వార్షిక అమరతిథి సందర్భంగా నిర్వహిస్తున్న 37వ పాదయాత్ర-పల్లకి సేవ రథయాత్ర 5వ రోజు సోమవారం ఉదయం 6 గంటలకు మహాబత్‌పూర్ నుంచి రాయికోడ్ క్రాస్ రోడ్, శంశోద్దిన్‌పూర్, న్యాల్ కల్, మిర్జాపూర్, ముంగి, రుక్మాపూర్ గ్రామాల మీదుగా రాత్రికి హద్నూర్ దత్తగిరి ఆశ్రమానికి చేరుకుంది. మధ్యాహ్నం ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమం వద్ద భక్తులు విరామం నిర్వహించారు. సాయంత్రం 4 గంటల 30 నిమిషాలకు ముంగి ఆశ్రమం నుంచి బయలుదేరి రుక్మాపూర్ మీదుగా హద్నూర్ చేరుకుంది. గ్రామంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు నిండు కలశాలతో భజన సంకీర్తనలతో ఘనంగా స్వాగతం పలికారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా హద్నూర్, రాయికోడ్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. న్యాల్ కల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది భక్తులకు ప్రథమ చికిత్స మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పూజశ్రీ నందిని మాత, విశ్వగిరి మహారాజ్, రాజశేఖర్ గౌడ్, విట్టల్, రవి,రామ్ రెడ్డి, మల్లయ్య, ఎం.రాజ్‌కుమార్,బి.విజయ్‌కుమార్, విట్టల్ రెడ్డి,గోపాల్ రెడ్డి,సంగారెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## పాడైనా బోర్ల కు మరమ్మత్తులు..
## త్రాగునీటి సమస్యకు చెక్

**మదనంతాపూర్ సర్పంచ్ ప్రియాంకలక్ష్మణ్**



**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ప్రజలకు త్రాగునీటి సమస్యను తలెత్తకుండా చూస్తున్నామని మదనంతాపూర్ గ్రామ సర్పంచ్ ప్రియాంక లక్ష్మణ్ అన్నారు. సోమవారం పెద్దేముల్ మండల పరిధిలోని మదనంతాపూర్ గ్రామ పంచాయతీలో 1వ వార్డు సభ్యుడు విజయ్ నాయక్ ప్రతిపాదనల మేరకు సర్పంచ్, ఉప సర్పంచ్,గ్రామ కార్యదర్శుల సహకారంతో గ్రామంలోని 2 త్రాగునీటి బోర్ల కు మరమ్మతులు చేయించారు.ఈ సందర్భంగా మదనంతాపూర్ గ్రామ సర్పంచ్ ప్రియాంక లక్ష్మణ్ మాట్లాడుతూ..వేసవి కాలం దృష్ట్యా మదనంతాపూర్ గ్రామ ప్రజలకు ఏలాంటి త్రాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తున్నామని అన్నారు. గ్రామంలో ఏ చిన్న సమస్య వచ్చిన వెంటనే స్పందించి వేగంగా పరిష్కరిస్తున్నామని అన్నారు.ప్రజల దాహార్తిని తీర్చడానికి ముందస్తు ప్రణాళికలను చేస్తున్నామని,గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరు త్రాగునీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి అశోక్,ఉప సర్పంచ్ బుజ్జి బాయి,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆనందోత్సాహాల
## మధ్య హోలీ వేడుకలు

**పెద్దేముల్ గ్రామ ఉపసర్పంచ్ డివై ప్రసాద్**





**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండల కేంద్రంలో సోమవారం హోలీ పండుగను గ్రామస్తులు అత్యంత ఉత్సాహంతో, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు.చిన్నా పెద్దా తేడా లేకుండా రంగులు చల్లుకుంటూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ సోదరభావాన్ని చాటుకున్నారు. యువతులు, యువకులు డీజే పాటలకు నృత్యాలు చేస్తూ వేడుకలను మరింత ఉత్సాహభరితంగా నిర్వహించుకొన్నారు.ఈ సందర్భంగా పెద్దేముల్ గ్రామ ఉపసర్పంచ్ డివై ప్రసాద్ మాట్లాడుతూ హోలీ పండుగ సామరస్యానికి, స్నేహభావానికి ప్రతీక అని అన్నారు. కులమత భేదాలు మరిచి అందరూ కలిసిమెలిసి పండుగను జరుపుకోవడం సమాజానికి మంచి సందేశం అని పేర్కొన్నారు.గ్రామంలో శాంతి, ఐక్యతలు నెలకొనాలని ఆకాంక్షించారు.హోలీ పండుగ సంబురాలలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు,యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ జాతర పోస్టర్ ను ఆవిష్కరించిన
## డిఎస్పి సైదా నాయక్



**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని ఝరాసంగం మండలం పరిధిలో కుప్పానగర్ గ్రామంలో నిర్వహించనున్న శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాల పోస్టర్‌ను జహీరాబాద్ డిఎస్పి సైదా నాయక్ ఆవిష్కరించారు. మార్చి 04, 06, 08 తేదీలలో జరిగే ఈ జాతర ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో డిఎస్పిని ఉత్సవ కమిటీ సభ్యులు మాణిక్ పాటిల్, వెంకటేశం ఘనంగా సన్మానించి, జాతరకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆహ్వానించారు.ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ...ఆధునిక కాలంలో కూడా నాటక ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. యువత ఫోన్లకు మాత్రమే పరిమితం కాకుండా ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని తమలోని కళా ప్రతిభను వెలికితీయాలని సూచించారు.

**జాతర కార్యక్రమ వివరాలు ఇలా ఉన్నాయి:**

- మార్చి 04 (బుధవారం): అమ్మవారికి అభిషేకం, సాయంత్రం బోనాలు, ఎల్లమ్మ నాటకం - భాగం 1
- మార్చి 06 (శుక్రవారం): నిత్య పూజలు, సాయంత్రం ఎడ్లబండ్ల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, ఎల్లమ్మ నాటకం - భాగం 2
- మార్చి 08 (ఆదివారం): ప్రత్యేక పూజలు, ఎల్లమ్మ జీవిత చరిత్ర నాటకం - భాగం 3 (ముగింపు)

గత 32 ఏళ్లుగా నిరంతరంగా కొనసాగుతున్న ఈ జాతర ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని గ్రామ పెద్దలు, గ్రామస్తులు మరియు ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.



## నేటికీ రైతుకు అందని భరోసా

- బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్

**మిర్యాలగూడ, స్నేహిత ఎక్స్ ప్రెస్:** తెలంగాణ రాష్ట్రంలో రైతులకు పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా నిధులు నేటికి అందకపోవడంతో రైతాంగం తీవ్ర ఆవేదనతో ఉన్నారని బీసీ యువజన సంఘం రాష్ట్ర సమావేశంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ పంట పెట్టుబడికి ముందుగా అందించాల్సినటువంటి రైతు భరోసా నిధులు పంట కోత దశకు వచ్చిన కూడా ప్రభుత్వం నేటికీ రైతు భరోసా నిధులు రైతుల ఖాతాలో వేయకపోవడం బాధాకరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ రైతులతో చెలగాటం ఆడుతుంది పెట్టుబడి సాయంగా ప్రభుత్వం అందించే సాయం అందకపోవడంతో రైతులు.అప్పులు చేస్తున్న సందర్భం తెలంగాణ రాష్ట్రంలో కనిపిస్తోంది రైతులను చిన్నచూపులుగా చూస్తున్నటువంటి ఈ ప్రభుత్వంకి రైతులు త్వరలోనే మంచి గుణపాఠం చెప్తారని అన్నారు ఒకవైపు రైతు భరోసా నిధులు అందకపోవడం మరోవైపు పంటకు కావాల్సిన ఎరువులు అందించకపోవడంతో రైతాంగం ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత గా ఉంది కాబట్టి ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు ఇచ్చేటువంటి రైతు భరోసా నిధులు తక్షణమే విడుదల చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో నీల వెంకటేష్, రాజేందర్, అనంతయ్య, సతీష్, రవీందర్, సావిత్రి, నిర్మల తదితరులు పాల్గొన్నారు

## రంగుల పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో
## సరికొత్త వెలుగులు నింపాలి

**ఎన్కేపల్లి గ్రామ 5వ వార్డు మెంబర్ మాణయ్య**



**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** రంగుల పండుగ హోలీ ప్రతి ఒక్కరి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలి అని మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామ 5వ వార్డ్ మెంబర్ కావాలి మాణయ్య అన్నారు మండల ప్రజలందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రంగుల పండుగ హోలీ ప్రతి ఒక్కరి జీవితాల్లో సరికొత్త వెలుగులు,ఆనందాలు విజయాలు నింపాలని ఆకాంక్షించారు.ఈ హోలీ పండుగ మీ కుటుంబ సభ్యులందరి మధ్య ప్రేమానురాగాలు మరింత బలపరచాలని ప్రతి ఇంటిలో నవ్వులు ఉండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.



## మాజీ చైర్మన్ సతీమణి అంత్యక్రియాల్లో
## పాల్గొన్న మొహమ్మద్ తన్వీర్



**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ఆదివారం నాడు అనారోగ్యంతో చికిత్స పొందుతూ జహీరాబాద్ మాజీ మున్సిపల్ చైర్మన్ మంకల్ సుభాష్ సతీమణి సుజాత మరణించిన విషయాన్ని తెలుసుకుని వారి కుటుంబ సభ్యులకు పరామర్శించి సోమవారం నాడు నిర్వహించిన అంత్యక్రియల్లో తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మహమ్మద్ తన్వీర్ హాజరయ్యారు. వారితో పాటు మున్సిపల్ చైర్మన్ మొహమ్మద్ యూనుస్,కౌన్సిల్ సభ్యులు జాంగిర్ ఖురేషి,మొహమ్మద్ అక్రమ్,మాజీ కౌన్సిలర్ మొతిరం,సతీష్ సెట్,మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్ ఉద్యోగ
## నిర్మాణానికి కీలక ఒప్పందం



**జడ్చర్ల,స్నేహిత ఎక్స్ ప్రెస్:** డాక్టర్ బి.ఆర్.ఆర్ ప్రభుత్వ కళాశాలలో తెలంగాణ స్కిల్స్ మరియు నాలెడ్జ్ సెంటర్ వారు నిర్మాణ్ అను నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ మహబూబ్ నగర్ వారితో పరస్పర ఒప్పంద పత్రాన్ని ఏర్పాటు చేసుకున్నారు.ఈ మెమొరండమ్ ఆఫ్ అండర్స్టాండింగ్ పై డాక్టర్ బి.ఆర్ ఆర్ ప్రభుత్వ కళాశాల తరఫున ప్రొఫెసర్ జి సుకన్య గారు నిర్మల్ సంస్థ తరఫున శివ నవత కనికే ఒప్పంద పత్రము పై సంతకము చేయడం జరిగింది.ఈ సహకార పత్రము ఆధారంగా భవిష్యత్తులో యువతకు ఉద్యోగ నిర్మాణ సామర్థ్యాల కల్పనకై అవసరమైన శిక్షణా తరగతులను కళాశాలలో నిర్వహించడం జరుగుతుంది.ఈ ఒప్పందంలో భాగంగా కళాశాల మరియు నిర్మాణ్ ఆర్గనైజేషన్ వారు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎనేబుల్ సర్వీసెస్ సాఫ్ట్ స్కిల్స్ వర్క్ రెడీనెస్ స్కిల్స్ ఫైనాన్షియల్ లిటరసీ స్కిల్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బేసిక్స్ పై విద్యార్థులకు శిక్షణ తరగతులను నిర్వహించడంతోపాటు ఉద్యోగ కల్పనకై ప్లేస్మెంట్స్ డ్రైవ్ లను నిర్వహించడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు ఈ ఒప్పందం ఐదు సంవత్సరాల కాల పరిమితితో ఏర్పాటు చేయడం జరిగింది. నేటి ఆధునిక విద్యావ్యవస్థ యొక్క అంతిమ ఉద్దేశం ఉద్యోగ కల్పన.ఈ లక్ష్య సాధనకై నిర్మాణ ఆర్గనైజేషన్ మహబూబ్నగర్ వారు తమ వంతు సహకారాన్ని అందించడానికి ముందుకు రావడం చాలా ఆనందదాయకమని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి.సుకన్య, అభిప్రాయపడ్డారు. పరస్పర అంగీకార పత్రం నిర్వహణకు డాక్టర్ నాగలక్ష్మి టి.ఎస్.కే.సి కోఆర్డినేటర్ మరియు వీర ప్రతాప్,టీఎస్ కేసి మెంటర్ మరియు అసరుద్దీన్ మరియు బిందు నిర్మాణ సంస్థ నిర్వాహక సభ్యులు పాల్గొనడం జరిగింది.

## అల్లాదుర్గం ప్రజావాణికి ఒక్కటే దరఖాస్తు
## ఎమ్మార్వో తాసిల్దార్ మల్లయ్య




**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** అల్లాదుర్గంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఈసారి కేవలం ఒకే ఒక దరఖాస్తు వచ్చినట్లు తహశీల్దార్ మల్లయ్య తెలిపారు. భూ సమస్య పరిష్కారం కోరుతూ.. అందిన ఈ దరఖాస్తును పరిశీలించి, త్వరితగతిన పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. గ్రామాల్లోని వివిధ సమస్యలపై ప్రజలు ప్రజావాణిని వేదికగా చేసుకుని దరఖాస్తులు సమర్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వేదప్రకాష్ రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శిక్షణలో కోటగిరి,పోతంగల్ మండల సర్పంచ్లు

**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నేషనల్ అకాడమీలో సోమవారం రోజున నూతన సర్పంచు లకు అట్టహాసంగా శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి.ఈ నెల 2 నుండి 7 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు కోటగిరి,పోతంగల్ మండలాల సర్పంచులు ఐదు రోజులపాటుగా కొనసాగనున్న శిక్ష ణ తరగతులకు హాజరైతున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్లకు వారి విధి విధానాలపై ఇచ్చే శిక్షణ కార్యక్రమానికి ఉమ్మడి మండలాల నుండి గ్రామపంచాయతీల నూతన సర్పంచ్లు శిక్షణ తరగతులకు వెళ్లారు.



# సార్లు.. సంతకాలు పెడతారు వెళ్ళిపోతారు

- ప్రజావాణి ఫిర్యాదుల స్వీకరణలో నిండు నిర్లక్ష్యం
- పెద్దేముల్ ప్రజావాణి కార్యక్రమానికి ఒకే ఒక్క అధికారి హాజరు
- 4 అధికారులు సంతకాలు పెట్టి వెళ్లిపోయిన వైనం
- ప్రజావాణి సమయానికి ముందే.. ఇంకో సమావేశం ఏర్పాటు
- మధ్యాహ్నం 12:30 నిముషాలకే ముగిసిన పెద్దేముల్ ప్రజావాణి
- జిల్లా కలెక్టర్ సారూ విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న అధికారులపై చర్యలు తీసుకోండి సారూ



**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** పెద్దేముల్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి అధికారులు ఇష్టారాజ్యాంగా హాజరువుతున్నారు. కొంతమంది అధికారులు ఏకంగా ప్రజావాణి రిజిష్టర్ లో కేవలం సంతకాలు పెట్టి తమకేమీ పట్లనట్లు ప్రజావాణి నుండి వెళ్ళిపోతున్నారు.ఈ పరిస్థితి పెద్దేముల్ మండల పరిషత్ ప్రజావాణిలో నెలకొంది.ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి అందులో అన్ని శాఖల అధికారులు విధిగా పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించి వారి సమస్యలను పరిష్కరించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఉన్నప్పటికీ తమకేమీ పట్టనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అధికారులు ప్రజావాణిని లైట్ తీసుకుంటున్నారు.కొందరు నామమాత్రంగా హాజరైతే మరికొందరు ఏకంగా సంతకాలు పెట్టి ప్రజావాణి నుండి దర్జాగా వెళ్ళిపోతున్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఏపీఓ నర్సింహులు, ఏపిఎం శివయ్య, సీనియర్ అసిస్టెంట్ శివ కుమార్,రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ సునీల్ కుమార్, ఏఈఓ అపర్ణ లు హాజరై అందులో కేవలం శివ కుమార్ ప్రజావాణిలో 12:30 నిముషాలవరకు ఉండగా మిగతా వారు కేవలం సంతకాలు పెట్టి అక్కడి నుండి దర్జాగా వెళ్లిపోయారు.5 మంది అధికారులు ప్రజావాణికి హాజరైతే అందులో కేవలం ఒకే ఒక్క అధికారి శివ కుమార్ మధ్యాహ్నం 12:30 వరకు ప్రజావాణిలో కూర్చొని ఆయన కూడా అక్కడి నుండి వెళ్లిపోయారు.మరో వైపు ప్రతి సోమవారం ఉదయం 10:30 నిముషాల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్లక్ష్యంగా కేవలం మధ్యాహ్నం 12:30 నిముషాల వరకే నిర్వహించి గాలికి వదిలేశారు.మరోవైపు ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతున్న నేపథ్యంలోనే పెద్దేముల్ మండల తహసీల్దార్ వెంకటేష్ ప్రసాద్ అదే సమావేశంలో బీఎల్వో, బీఎల్ఏ లతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయడం విశేషం.ప్రజావాణి కార్యక్రమాన్ని అధికారులు పూర్తిగా లైట్ తీసుకోవడంతో ప్రజావాణిలో ఆయా గ్రామాల ప్రజలు వివిధ రకాల సమస్యలపై దరఖాస్తులు ఇవ్వడానికి వెనకడుతూ అసలు ప్రజావాణికే రావడం లేదు? వచ్చినా కూడా వారి సమస్యకు సంబంధించిన అధికారులు ప్రజావాణికి హాజరుకాకపోవడంతో వారు ఎవరికి ఏం చెప్పుకోవాలో తెలియక తమ సమస్యలు పరిష్కారం కాక, చేసేదేమీ లేక నిరాశతో ఇంటిబాట పడుతున్నారు. ఇప్పటికైనా వికారాబాద్ జిల్లా కలెక్టర్,అదనపు కలెక్టర్ లు, ఇతర ఉన్నతాధికారులు ప్రజావాణి కార్యక్రమ నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న పెద్దేముల్ మండల వివిధ శాఖల అధికారులపై శాఖాపరమైన చర్యలు చేపట్టి మండల కేంద్రంలో పాటు ఆయా గ్రామాల ప్రజలకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

## ఎల్లకొండ పార్వతీ పరమేశ్వరుని దర్శించుకున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే

**ఘనంగా స్వాగతం పలికిన సర్పంచ్ కొండల్ యాదవ్**



**నవాబుపేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండల పరిధిలోని ఎల్లకొండ గ్రామంలో గతవారం రోజులుగా ఎంతో అంగరంగ వైభవంగా జరుగుతున్న పార్వతీ పరమేశ్వరుల ఎంతో వైభవంగా జరుపుకోవడం జరుగుతుంది అని పేర్కొన్నారు ప్రసిద్ధిగాంచిన శివపార్వతుల ఆశీర్వాదాన్ని స్వీకరించిన చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ఎల్లకొండ సర్పంచ్ కొండల్ యాదవ్ సమక్షంలో ఎల్లకొండ గుట్టపై వెలిసిన పార్వతీ పరమేశ్వరుల ఆశీర్వాదం తీసుకోవడం జరిగిందని అన్నారు. పార్వతీ పరమేశ్వరుల ను పూజించిన ప్రతి ఒక్క కుటుంబానికి అష్టైశ్వర్యాలతో ఆనందంగా ఉంటారని శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కొట్టదని అందువల్లనే ప్రతి కుటుంబం ఆ ఈశ్వరుని నామస్వరములు ఉండాలని గ్రామ సర్పంచ్ కొండల్ యాదవ్ అన్నారు. ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి,జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్,ఎల్లకొండ లో జరిగే ఉత్సవాలకు రావడం ఎంతో ఆనందంగా ఉందని గ్రామ సర్పంచ్ కొండలు యాదవ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సాయినాథ్,యాదవ్ రామచంద్రయ్య ఉపసర్పంచ్, ఎం.ప్రకాష్,అజముద్దీన్,గాలయ్య, వెంకటయ్య,నరేష్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పలు నిర్మాణాల పనులకు భూమి పూజ చేసిన సర్పంచ్ మగరే పద్మావతి సాయికిరణ్



**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** పోతంగల్ మండలంలోని టాక్లి గ్రామంలో సోమవారం ఎంజిఈఎనర్జీఎస్ గ్రాండ్స్ కింద మంజూరైన రూ.10,00,000 వ్యయంతో గ్రామ పంచాయ తీ భవన నిర్మాణానికి అలాగే గ్రామంలో పలు సిసి రోడ్ల నిర్మాణానికి గ్రామ పెద్దల సమక్షంలో సర్పంచ్ మగరే పద్మావతి సాయికిరణ్ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు.అనంతరం గ్రామంలో ఉపాధి హామీ పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో టాక్లి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ కాంబ్లే సురేఖ జ్యోతిపాల్,వార్డు సభ్యులు ఉత్తంరావ్ చిక్లే గ్రామ పెద్దలు మగరే జీవన్ రావు,సంజయ్, రాజేశ్వరరావు,విశ్వంబర్,రమేష్,ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

**బీవి.హెచ్.పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సిములు డిమాండ్**

**వికారాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో, హలో వికలాంగ చలో కొడంగల్,సిఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ లో నిర్వహించ తలపెట్టిన కార్యక్రమాన్ని అడ్డుకోవాలనే ఉద్దేశంతో,భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సిములును బంట్వారం పోలీస్ వారు ముందస్తు అరెస్టు చేయడం జరిగింది,ఈ యొక్క ముందస్తు అరెస్టులకు భయపడేది లేదని ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసిన గాని మా యొక్క కార్యక్రమం కొనసాగిస్తామని, వికలాంగులకు అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చక పోతే రాష్ట్రవ్యాప్తంగా మాయొక్క ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము.








## సబ్సిడీ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎంఎ సత్తార్**

**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ప్రభుత్వం ఉద్యాన శాఖ ఇస్తున్న సబ్సిడీ డ్రిప్ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమల శాఖ అధికారి ఎంఎ సత్తార్ అన్నారు.మండల పరిధిలో నీ వెల్చాల్ గ్రామంలో రకరకాల ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతు ఎండి ఇబ్రహీం పొలంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సుకి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బావులు బోర్లు కలిగిన రైతులు తమ పొలాలలో కూరగాయలు పంటలు సాగు చేసుకుంటే ప్రభుత్వం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీలపై పరికరాలు అందజేస్తుందని అన్నారు చిన్న కారు రైతులకు ( ఓసి బిసి) డ్రిప్ సబ్సిడీ 90%,ఎస్సీ ,ఎస్టీ రైతులకు 100% స్ప్రింకర్ సబ్సిడీ 75% అన్ని కేటగిరిల రైతులకు రూ.6341ల సబ్సిడీ ప్రభుత్వం అందిస్తుంది రైతులు ఉపయోగించుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వెల్చాల్ సర్పంచ్ శ్రీనివాస్,దుర్గం చెరువు సర్పంచ్ లావణ్య మోహన్,హెచ్ ఓ అక్షిత రెడ్డి హెచ్ ఓ కమల,కొఠారి కంపెనీ మేనేజర్ రవికాంత్ మరియు వివిధ డ్రిప్ కంపెనీలో డిసిఓలు డీలర్ రైతులు తదితరులు పాల్గొనడం జరిగింది.



Printed, Published, Edited & Owned by **Rathod Vinod Kumar**, Printed At Falcon Printing Press, **SNEHITHA PUBLICATIONS** #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad Town,Sangareddy Dist: Pin :502220, State :Telangana, Published at SNEHITHA PUBLICATIONS #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad, 502220, Dist: Sangareddy, T.S., Editor: **Rathod Vinod kumar**, RNI. No. APTEL/2009/29308, Cell: 9550021491,8341021491Mail :expresstelugudaily@gmail.com